## స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం



విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్స్ అందజేస్తున్న ఎంఈవో హరిశ్చంద్ర

పరిగి, జూన్ 24: విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులు అందజేసిన స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని పరిగి ఎంఈవో హరిశ్చంద్ర పేర్కొన్నారు. సోమవారం పరిగి మండలంలోని ఇబ్రహీంపూర్, ఇబ్రహీంపూర్‌తండాలలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అంకిత స్వచ్ఛంద సేవా సంస్థ, గ్రీన్ సోల్ ఫౌండేషన్ సహకారంతో బ్యాగులు, మ్యాట్‌లు, చెప్పులను ఎంఈవో అందజేశారు. అదేవిధంగా ఇబ్రహీం పూర్‌తండాలో దేవ్‌సింగ్ అనే యువకుడు విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ అందజేవారు. ఈ కార్యక్రమంలో అంకిత స్వచ్ఛంద సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు నర్సింహులు గౌడ్, మంజుల, సంస్థ ప్రతినిధి అనంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దాతల సహకారం మరువలేనిది...



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసిన పూర్వ విద్యార్థి

ధారూరు, జూన్ 24: దాతలు ముందుకు వచ్చి నోట్ పుస్తకాలు, పలుకలు, బాక్స్‌లు పెన్నులు అందించడం అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాణిక్యం అన్నారు. సోమవారం ధారూరు మండల పరిధిలోని పులిచింతల మడుగు తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి వర్ధ్య లాలు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలుకలు అందించారు. ఈ సందర్భంగా ఆయనకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు జ్యోతి, పాఠశాల చైర్మన్ లక్ష్మి, గ్రామ నాయకులు శంకర్, రాందాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పోల్ టూ పోల్ సర్వే..




బొంరాస్‌పేట, జూన్ 24 : విద్యుత్ స్తంభాల స్థితిగతులు తెలుసుకునేందుకు ట్రాన్స్‌కో అధికారులు పోల్ టూ పోల్ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందుకోసం ట్రాన్స్‌కో విభాగం సిబ్బంది మొబైల్‌లోని యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. సర్వేను బొంరాస్‌పేటలో ఏఈ నాగరాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసే ఫీడర్లలో ఉన్న విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లి యాప్‌లో జీపీఎస్ ఆధారంగా ఆ స్తంభం ఏ ప్రాంతంలో ఉంది, దానికి ఉన్న అన్ని పరికరాలు సక్రమంగానే ఉన్నాయా లేదా అనే వివరాలను నమోదు చేస్తున్నామని తెలిపారు. భవిష్యత్‌లో ఆ విద్యుత్ స్తంభానికి ఏ సమస్య వచ్చినా తెలుసుకునే అవకాశం ఉంటుందని ఏఈ నాగరాజు తెలిపారు.

### వర్షాలు పడాలని పూజలు..



వికారాబాద్, జూన్ 24 : వికారాబాద్ మండల పరిధిలోని ధ్యాచారం గ్రామంలో రైతులు వర్షాలు కురువాలని వీరభద్రేశ్వస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులందరూ ఒక్కచోట చేరి వంటావార్పు చేసి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అలాగే వికారాబాద్ మండలం గొట్టిముక్ల గ్రామంలో రైతులు వర్షాలు కురువాలని గ్రామంలో ఉన్న బొడ్రాయికి పూజలు చేసి నీటిని పోశారు.

### ఐక్యంగా గ్రామ సమస్యలు పరిష్కరించుకుందాం



కొడంగల్, జూన్ 24: గ్రామ సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకుందామని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని రుద్రారం గ్రామంలో పర్యటించి నర్సరీని పరిశీలించారు. అనంతరం రైతువేదికలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన ప్రజా సమస్యలను అడిగితెలుసుకున్నారు. అదేవిధంగా నర్సరీని పరిశీలించి హరిత హారానికి మొక్కలు నాటే విధంగా వాటిని సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప సేవాట్రస్ట్ జిల్లా కమిటీ ఎన్నిక



మర్పల్లి, జూన్ 24: అఖిల భారత అయ్యప్ప సేవాట్రస్ట్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అఖిల భారత అయ్యప్ప ట్రస్ట్ వ్యవస్థాపకులు మసీదు రాజేందర్ గౌడ్ తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నీలి శ్రీకాంత్, అధ్యక్షుడిగా సీహెచ్ రవి, కార్యదర్శిగా గిరిగౌడ్, కోశాధికారిగా మనోహర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు తేలు శ్రీనివాస్, జనగం శ్రీనివాస్, విగ్నేశ్, వీరబాబు, కొనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భగ్గుమంటున్న కూరగాయల ధరలు

- సెంచరీ కొట్టిన టమాట
- అదే దారిలో మిగతావి..



బొంరాస్‌పేట, జూన్ 24 : కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. సామాన్య మధ్య తరగతి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి.ఏటా వానకాలంలో సహజంగా కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. కానీ మునుపెన్నడూ లేని విధంగా ధరలు ఆకాశాన్నంటాయి. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు పెరిగిన ధరలను చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. పెరిగిన ధరలతో ఏం కొనాలి ఏం తినాలని బెంబేలెత్తుతున్నారు. గతం వారం రోజుల కిందట కిలో టమాట రూ. 40లు ఉండగా ఆదివారం బొంరాస్‌పేట, తుంకిమెట్ల గ్రామా ల్లో జరిగిన వారాంతపు సంతల్లో రూ.100కు పెరిగింది. ప్రతి కూరలో వాడే టమాట ధర ఆకాశాన్నంటడంతో కిలో కొనేవారు అర కిలోతోనే సర్దుకుంటున్నారు. టమాట ధర బాటలోనే మిగతా కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. పచ్చి మిరప కిలో రూ.100, వంకాయలు కిలో రూ. 80, బీర కాయలు రూ.100లు, చిక్కుడు రూ.80లు, ఆలుగడ్డ రూ.80లు, బెండకాయ, దొండకాయలు రూ.80, క్యారట్ రూ.80లు, క్యాప్సికం రూ.80లు, క్యాబేజీ రూ.80 వరకు పెరిగాయి. వీటితో పాటు ఆకు కూరల ధరలు బాగా పెరిగాయి. రూ.40లకు కిలో అమ్మే పాలకూర రూ.80లకు పెరిగింది. తోటకూర, ఇతరకూర ధరలు కూడా రూ.60కి పైగానే ఉన్నాయి. కొత్తిమీర కిలో రూ. 200లు పలుకుతుంది. ధరలను చూసి కళ్లు బైర్లు కమ్ముతున్నాయని, రూ.500లు తీసుకెళితే వారానికి సరిపడా కూరగాయలు కూడా రావడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. కూరగాయల సాగు బాగా తగ్గడంతో పాటు సాగు చేసిన కూరగాయల పంటలు కొన్ని రోజుల కిం దట కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్నాయని, ఇతర రాష్ర్టాల నుంచి దిగుమతి చేసుకోవడం వల్ల రవాణా చార్జీలు కలిపి ధరలు ఆకాశాన్నంటుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ముున్ముందు వర్షాలు ఎక్కువగా కురిస్తే కూరగాయలు కొనే పరిస్థితి ఉండదేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

యాలాల, జూన్ 24: బస్సు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... తాండూరు పట్టణం గ్రీన్ సిటీ కాలనీకి చెందిన వినోద్ కుమార్(35) కిరాణా షాప్‌తో పాటు పాలిషింగ్ యూనిట్‌లను నడిపిస్తున్నాడు. సోమవారం సాయంత్రం లక్ష్మీనారాయణపూర్ రోడ్డు మార్గం నుంచి తాండూరుకు బైక్‌పై వచ్చే క్రమంలో ఎస్వీ ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే అదే సమయంలో తాండూరు నుంచి దౌల్తాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. దీంతో వినోద్ కుమార్ తలకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

## సమగ్ర కులగణన చేపట్టాలి

దోమ,జూన్ 24 : సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషను పెంచుతామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల సందర్భంగా అనేక బహిరంగ సభల్లో హామీ ఇచ్చినప్పటికీ తెలంగాణలో కాంగ్రెస్ పాలకుల తీరు అందుకు విరుద్ధంగా ఉందని దోమ మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమగ్ర కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షాన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణ పాఠం చెబుతామన్నారు.

# ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

బొంరాస్‌పేట, జూన్ 24: మండలంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభ నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రూ.6.94 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టారు. వీటిపై సామాజిక తనిఖీ సిబ్బంది వారం రోజులుగా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు జరిగిన పనులను వివరించారు. సోమవారం మండలస్థాయిలో నిర్వహించిన ప్రజావేదిక సభలో గ్రామాల వారీగా చేపట్టిన పనులు, చేసిన ఖర్చుల వివరాలు, పనుల్లో జరిగిన లోటుపాట్లను తనిఖీ సిబ్బంది చదివి వినిపించారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో 47 గ్రామ పంచాయతీలు ఉండగా సాయంత్రం ఏడు గంటల వరకు 15 గ్రామాల వివరాలను ప్రజావేదిక సభలో చదివి వినిపించారు. మిగతా గ్రామాల వివరాలను మంగళవారం చదివి వినిపిస్తారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ రవి, ఏపీడీ సరళ, విజిలెన్స్ ఆఫీసర్ భార్గవి, అంబుడ్స్‌మెన్ రాములు, ప్రోగ్రాం మేనేజర్ అశోక్‌కుమార్, ఎస్టీఎం దత్తు, ఎస్‌ఆర్‌పీలు గంగరాజు, స్వామి, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఏపీవో మల్లికార్జున్, టీఏలు, ఎఫ్‌ఏలు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ధరణి సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలి



తహసీల్దార్ కిషన్‌ను అడిగి వివరాలు తీసుకుంటున్న తాండూరు ఆర్డీవో శ్రీనివాస్ రావు

పెద్దేముల్, జూన్ 24 : ధరణిలో ఉన్న పెండింగ్ భూ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించాలని తాండూరు ఆర్డీవో ఎం.శ్రీనివాస్ రావు అన్నారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను. రిజిస్ట్రేషన్ స్లాట్ల వివరాలను పరిశీలించి తహసీల్దార్ కె.కిషన్‌ను అడిగి పలు విషయాలను తెలుసుకున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో, జనరల్ సర్టిఫికెట్ల వంటివి ఏమైనా పెండింగ్ ఉంటే వాటిని కూడా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో జరిగే రిజిస్ట్రేషన్ స్లాట్‌లను ఏ రోజుకారోజు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.మహేశ్‌కుమార్, ఆర్ఐ రాజురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వేణు, జూనియర్ రికార్డ్ అసిస్టెంట్‌లు మహేశ్, హరీశ్ ఉన్నారు.

## రూ.10వేల విలువ చేసే గుట్కాల పట్టివేత



పరిగి, జూన్ 24: పరిగి పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో పోలీసులు రూ.10వేల విలువ చేసే గుట్కాలను పట్టుకున్నారు. పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకా రం సోమవారం పట్టణంలో తనిఖీలు చేస్తుండగా గాంధీచౌక్ దగ్గర గల బాలాజీ కిరాణం దుకాణంలో రూ.10వేల విలువ చేసే నిషేధిత గుట్కాలు పట్టుబడ్డాయి. కిరాణం దుకాణం నడుపుతున్న కిషోర్ కుమార్‌పై కేసు నమోదు చేసి గుట్కాలు స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిషేధిత వస్తులను ఎవరైనా విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

సుల్తాన్‌బజార్, జూన్ 24: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలంటూ శాంతియుతంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించిన బీజేవైఎం కార్యకర్తలపై దాడికి పాల్పడ్డ పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అనంతరం హెచ్ ఆర్‌సీ ఆవరణలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ విలేకరులతో మాట్లాడుతూ.. టీజీపీఎస్సీ ముట్టడిలో పాల్గొన్న బీజేవైఎం కార్యకర్తలపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

### సొంత ఖర్చుతో నోట్ పుస్తకాలు పంపిణీ



యాచారం, జూన్ 24: మండలంలోని గున్‌గల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన తోటిరెడ్డి జయశ్రీనర్సిరెడ్డి తన సొంత ఖర్చులతో 86మంది విద్యార్థులకు రూ.15000లతో 600 నోట్ పుస్తకాలను సోమవారం అందజేశారు. కార్యక్ర మంలో పాండు రంగారెడ్డి, జంగయ్య, ప్రేమాకర్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, జయసింహరెడ్డి తదితరులున్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 24 : మండలంలోని తారామతిపేట గ్రామానికి చెందిన రైతు మద్ది కృష్ణవేణి ఈ నెల 8న మరణించింది. ఆమె భర్త మద్ది దానయ్యాగౌడ్‌కు మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. బాటసింగారం రైతు సేవా సహకార సంఘంలో ఆమె సభ్యురాలిగా ఉన్నారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ యాదవ్, నాయకులు చేగూరి నాగకిష్టయ్య, మేనేజర్ ఐలేశ్‌యాదవ్ ఉన్నారు.

## ప్రజా పాలన సేవా కేంద్రానికి దరఖాస్తుల వెల్లువ



బొంరాస్‌పేట ఎంపీడీవో కార్యాలయం వద్ద దరఖాస్తులు ఇస్తున్న ప్రజలు

బొంరాస్‌పేట, జూన్ 24: మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా ఈ ఏడాది జనవరిలో ప్రజాపాలన కార్యక్రమం నిర్వ హించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే వారికి ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు నెలకు రూ.2500లు, పింఛన్లు మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల వంటి వాటికి పేదలు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ప్రభుత్వం 200 యూనిట్లు విద్యుత్తు వినియోగించే వారికి జీరో బిల్లులు, రూ.500లకే గ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించినా చాలా మందికి అమలు కావడం లేదు. దీంతో మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి పథకాలు అమలు కాని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీంతో బొంరాస్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సేవా కేంద్రానికి ప్రజలు క్యూకడుతున్నారు. పథకాల కోసం దరఖాస్తులు అందజేస్తున్నారు.

## తహసీల్దార్ హామీతో ధర్నా విరమణ



తహసీల్దార్‌కు మెమోరాండం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బొంరాస్‌పేట, జూన్ 24 : మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు, పాస్ పుస్తకాలు ఇవ్వాలని, రికార్డుల్లో తప్పుగా నమోదైన పేర్లను, విస్తీర్ణాన్ని సరి చేయాలన్న డిమాండ్‌తో సోమవారం ప్రజా సంఘాలు నిర్వహించతలపెట్టిన ధర్నాను విరమించారు. ఎన్నికల కోడ్ కారణంగా రైతుల భూముల సమస్యలు పరిష్కరించలేకపోయామని, రెండు మూడు రోజుల్లో భూముల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ పద్మావతి ప్రజా సంఘాల నాయకులకు హామీ ఇవ్వడంతో ధర్నాను విరమిస్తున్నట్లు ప్రకటించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే ధర్నాను నిర్వహిస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, కేఎన్‌పీఎస్ నాయకులు లక్ష్మయ్య, వెంకటయ్య, అంబేద్కర్ సంఘం నాయకులు రమేశ్, మోహన్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ఘట్‌కేసర్, జూన్ 24: ఘట్‌కేసర్ రైల్వే వంతెన పైనుంచి దూకిన బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అవుశాపూర్ సమీపంలోని వీబీఐటీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న నాగమణి (19) ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటున్నది. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన పైకి ఎక్కి కిందకు దూకి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన స్థానికులు తీవ్ర గాయాలైన ఆమెను ఘట్‌కేసర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దవాఖాన వైద్యులు ఆమెకు వెంటిలేటర్ పై చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికతో అసభ్య ప్రవర్తన.. ఐదేండ్ల జైలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 24(నమస్తే తెలంగాణ): ఒంటరిగా ఉన్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుడు మల్లికార్జున్(46)కు ఐదేండ్ల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ.. బాధిత బాలికకు లక్ష పరిహారం అందించాలని న్యాయసేవా సంస్థను ఆదేశిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పునిచ్చింది. అదనపు పీపీ సునీత కథనం ప్రకారం.. గుర్రంగూడ, పంచాయితీరాజ్‌నగర్ చెందిన బాలిక తల్లి ప్రైవేట్ పాఠశాలలో టీచర్. వీరి ఇంటికి సమీపంలోనే ఉండే నిందితుడు బాలిక తల్లితో 2018లో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో మల్లికార్జున్‌పై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వారి కుటుంబంపై కక్ష పెంచుకున్న మల్లికార్జున్ 2019, జనవరిలో వారి ఇంటి వద్దకు వెళ్లి 6వ తరగతి చదువుతున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. జరిగిన ఉదంతాన్ని బాలిక తల్లితో చెప్పడంతో మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు మల్లికార్జున్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

## భార్యను హత్య చేసిన భర్త

ఎల్బీనగర్, జూన్ 24 : మద్యం మత్తులో భార్యతో గొడవపడి.. హత్య చేసిన భర్త పారిపోయాడు. ఈ ఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి కథనం ప్రకారం.. బృందావన్ కాలనీలోకి చెందిన అన్వర్, గౌసియా (30) భార్యాభర్తలు. ఇద్దరూ ప్రతిరోజు రాత్రి సమయంలో మద్యం సేవించి గొడవ పడుతుంటారు. ఈ క్రమంలో జూన్ 22న కూడా ఇద్దరూ మద్యం సేవించి అర్ధరాత్రి 2 గంటల వరకు గొడవపడ్డారు. మరుసటి రోజు గౌసియా బయటకు రాలేదు. వీరింటికి సమీపంలోనే ఉంటున్న లక్ష్మి ఈ నెల 23న గౌసియాను పిలువగా ఆమె పలుకలేదు. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఆమె హాల్‌లో చలనం లేకుండా పడి ఉన్నది. లక్ష్మి వెంటనే చుట్టుపక్కల వారిని పిలిచింది. వారు 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అంబులెన్స్ వైద్య బృందం గౌసియాను పరీక్షించి.. అప్పటికే ఆమె మరణించినట్టు గుర్తించారు. ఘటనా సమాచారం అందుకుని అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మెడచుట్టూ కమిలిన గాయాలు, రెండు చేతుల పైన గాయాలు ఉన్నాయి. అక్కడి వారిని విచారించగా.. భర్త అన్వర్, భార్య గౌసియా గత రాత్రి రెండు గంటల వరకు గొడవ పడ్డారని తెలిపారు. భర్త అన్వర్ ఆమెకు ఉరిబిగించి.. ఊపిరి ఆడకుండా చేసి హత్య చేసినట్లు భావిస్తున్నట్టు సీఐ సైదిరెడ్డి తెలిపారు. గౌసియా భర్త పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**PUBLIC NOTICE**

Dt. 24-06-2024

General Public is hereby informed that my clients Nallala Srikanth, S/o. Nallala Mallesham and Surendrababu Manne, S/o.Manne Krishnaiah are entered into an agreement of sale with Rudravaram Kusuma, D/o. R. Sudhakar Reddy who is the original owner of agricultural land to an extent of Ac.0-20 Gts in Sy.No. 51/AA2 and with Smt. Kallem Swapna, W/o. K.Vishwanath Reddy to an extent of Ac.0-20 Gts in Sy.No.51/AA1/AA totally admeasuring Ac.1-00 Gts situated at Yeliminedu Revenue Village, Ibrahimpatnam Mandal and Division, Ranga Reddy District, bounded by North: Agricultural Land of P.Heeralal Patel and others in Sy.No.51/Part, South: Wood Factory of Neighbors in Sy.No. 51, East: Agricultural Land of the neighbors in Sy.Nos. 43 and 44, West: Yelimenedu to Pocharam Road and paid substantial amounts towards advance sale consideration.

Any person having any right, title, interest, claim or demand of any nature whatsoever in respect of the said agricultural land are hereby required to make the same known in writing along with the documentary proof thereof, to the undersigned within seven days from the date of publication hereof, failing which my client will proceed with sale transaction, without any reference to such claims and the claims if any, shall be deemed to have been given up or waived.

**Sd/- V.VENU MADHAV, ADVOCATE ,**
H.No. 11-7-119, HUDA Colony,
Saroornagar, Hyderabad-35
Ph: 9959315959, 8555049832